# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు రాష్ట్రమంత్రి వర్గం ఆమోదం తెలిపింది.
- ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి 308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- జాతీయ ఉపాధి హామీ పథకంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు.
- విశ్వవిద్యాలయాల్లో పరిపాలన కోసం యూనిఫైడ్ యాక్ట్ తీసుకురానున్నామని రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు.

==========================

రాష్ట్రంలోని చేనేత కార్మికుల ఇళ్లకు 200 యూనిట్ల వరకు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు రాష్ట్రమంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఈరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రి వర్గ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయుల బదిలీల నియంత్రణ చట్ట సవరణ బిల్లుకు, అలాగే అమరావతిలో భూ కేటాయింపులకు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయాలను క్యాబినెట్ ఆమోదించింది. ఎస్సీ వర్గీకరణ అంశంపై ఇటీవల రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ప్రభుత్వానికి అందించిన నివేదికకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే నంబూరులో వీవీఐటీయూకు ప్రైవేటు యూనివర్సిటీ హోదా కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో రెన్యూవబుల్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు, పలు సంస్థలకు భూ కేటాయింపులు, వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పేరు తాడిగడప మున్సిపాలిటీగా మార్పు చేస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి కార్యాలయంలో ముగ్గురు ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల పోస్టుల భర్తీకి మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది.

==========================

రాష్ట్రాన్ని 2047 నాటికి 308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు శాసనసభలో స్వర్ణాంధ్ర విజన్ -2047 డాక్యుమెంట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "నియోజకవర్గాలలో విజన్ డాక్యుమెంట్ అమలుపరిచే బాధ్యత శాసనసభ్యులదేనని, దీని కోసం ప్రభుత్వం సహకరిస్తుందని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 17.11 శాతం మేర వృద్ధి రేటు సాధించేలా లక్ష్యం పెట్టుకున్నామని, జిల్లాల వారీగా ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేస్తూ... అందుకు తగిన చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 37 సెకన్లు)

========================

జాతీయ ఉపాధి హామీ పథకంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈరోజు అసెంబ్లీ సమావేశాల్లో ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ... గత ప్రభుత్వ హయాంలో 250 కోట్ల రూపాయల అవకతవకలు జరిగినట్లు గుర్తించామని, దీనిపై విచారణ సాగుతోందన్నారు. ఉపాధిహామీ కూలీలకు వేతనాల పెంపు అంశం... కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుందని పవన్ కళ్యాణ్ వెల్లడించారు.

========================

పోలవరం ప్రాజెక్టు పునరావాస కాలనీల నిర్మాణ పనులను వేగవంతం చేసి, 2026 జూన్ నాటికి నిర్వాసితులకు ఇళ్లను అందజేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానామిస్తూ.. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో, నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాస కాలనీల నిర్మాణానికి అంతే ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. 75 నిర్వాసితుల కాలనీల్లో 49 నిర్మాణంలో ఉన్నాయని, ఆగస్టు లోగా భూసేకరణ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఒకే విడతగా 800 కోట్ల రూపాయలను కూటమి ప్రభుత్వం నిర్వాసితుల ఖాతాల్లో జమ చేసిందని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 37 సెకన్లు)

విరామం

========================

విశ్వవిద్యాలయాల్లో పరిపాలన కోసం యూనిఫైడ్ యాక్ట్ తీసుకురానున్నామని రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈరోజు శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ.. విద్యరంగంలో మెరుగైన చట్టం తీసుకొచ్చేందుకు సమీక్షిస్తున్నామన్నారు. ప్రతిష్టాత్మక విద్యాసంస్థలను రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని, ఐఐటీ మద్రాస్, టోక్యో యూనివర్సిటీ, TCSతో కలసి అమరావతిలో డీప్ టెక్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి లోకేష్ వెల్లడించారు.

(వాయిస్ 35 సెకన్లు)

========================

రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు 276 కోట్ల రూపాయల నిధులను కూటమి ప్రభుత్వం విడుదల చేసిందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. నూతన పిహెచ్‌సీల నిర్మాణంపై శాసనసభలో సభ్యులడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెబుతూ.. గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు సక్రమంగా బిల్లులు చెల్లించనందువల్లే పనులన్నీ అసంపూర్తిగా మిగిలిపోయాయన్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులను ప్రారంభిస్తామని మంత్రి వివరించారు. అసంపూర్తిగా వున్న విలేజ్ హెల్త్ క్లినిక్ ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులను మంజూరు చేసేందుకు కృషి చేస్తుందన్నారు. గిరిజన ప్రాంతాల్లో 5 మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులను నిర్మించి, తద్వారా గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవల్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

==========================

ప్రకృతి సేద్యం ద్వారా పండించిన ఉత్పత్తులు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడతాయని కృష్ణా జిల్లా సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. మచిలీపట్నంలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ను ఆమె ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఆమెతో మాట్లాడుతూ... ఎటువంటి రసాయనాలు, ఎరువులు వాడకుండా కూరగాయలు, పండ్లను పండిస్తున్నామని, ప్రజల నుండి తమ ఉత్పత్తులకు మంచి ఆదరణ లభిస్తుందని తెలిపారు. సేంద్రీయ పద్ధతుల ద్వారా పంటలు పండించడం వల్ల భూసారం పెరిగి పంటల దిగుబడి అధికమవుతుందన్నారు. ప్రతి గ్రామంలో ఒక్కొక్క క్లస్టర్ ఏర్పాటు చేసుకుని తక్కువ ప్రాంతంలో ఎక్కువ పంటలను పండించుకునే వెసులుబాటు ప్రకృతి సేద్యంలో ఉందని తెలిపారు.

(వాయిస్ 27 సెకన్లు)

==========================

అనకాపల్లిలో జిల్లాలో రైల్వే వంతెన గిర్డర్ దెబ్బతినడానికి గూడ్స్ రైలు కారణమని వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని దక్షిణ మధ్య రైల్వే స్పష్టం చేసింది. ఈ తెల్లవారుజామున గుర్తు తెలియని లారీ హైట్ గేజ్‌ను ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుందని వెల్లడించింది. దీనితో విశాఖ - విజయవాడ మార్గంలో పలు రైళ్ల రాకపోకలకు కాసేపు అంతరాయం ఏర్పడిందని, కొంత సమయం తర్వాత మరో ట్రాక్ పై నుంచి రాకపోకలను పునరుద్ధరించినట్లు తెలిపింది. దెబ్బతిన్న రైల్వే ట్రాక్‌కు తక్షణమే సిబ్బంది మరమ్మతులు చేపట్టారని, రైలు సేవలు ఇప్పుడు సాధారణంగా నడుస్తున్నాయని వెల్లడించింది.

==========================

ప్రకృతి వ్యవసాయం-2025 వార్షిక కార్యాచరణ ప్రణాళికలో ప్రతి ఒక్క రైతును భాగస్వామ్యం చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లాలమ్ భాస్కర్ రావు ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఆయన పాల్గొన్నారు.

==========================

==========================